సాక్షి తిరుపతి

మంగళవారం । 19 । మార్చి । 2024



నాయుడుపేటలో చెడ్డీ గ్యాంగ్

నాయుడుపేటలో చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. ఓ జ్యువెలరీ దుకాణంలో రూ.50 లక్షల విలువైన వస్తువులను దోచుకెళ్లింది. - IIలో



వైఎస్సార్‌సీపీలో చేరిక

టీడీపీకి చెందిన సుమారు 200 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. - IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం(సా)	సహర్ బుధవారం(ఉ)
తిరుపతి	6-26	4-58
గూడూరు	6-24	4-53

న్యూస్‌రీల్

జాబ్‌మేళాకు విశేష స్పందన



ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న ప్రతినిధులు

వెంకటగిరిరూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య సంస్థ ఆధ్వర్యంలో వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 5 బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులతో కలిసి నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు సుమారు 96 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరవ్వగా అందులో 61 మందికి ఉద్యోగ్యాలు వరించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్ లోకనాథం తెలిపారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్‌తో భూగర్భ జలాల పెంపు



పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: ఉపాధిహామీలో చేపట్టే అమృత్ సరోవర్‌తో భూగర్భ జలాలు పెంపొందించవచ్చని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని మోదుగులపాళెంలో జరుగుతున్న అమృత్ సరోవర్ పనులను పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అమృత్ సరోవర్ పనులను చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాలు పెంపొందితే రైతుల వ్యవసాయ బోర్లలో నీటి శాతం పెరుగుతుందన్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పని ప్రదేశంలో కూలీలకు నీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టెలు అందుబాటులో ఉంచాలన్నారు. కూలీలు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల్లోపు పనులు చేయాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పొలాల్లో పండ్లు, పూలు, మునగ తోటల పెంపకం చేపట్టాలన్నారు. ఏపీఓ దేవరి, సీడీసీఎల్‌ఆర్సీ చంద్రశేఖర్ రాజు, జేఈ బాలాజీరావు, సాంకేతిక సహాయకుడు వెంకటాద్రి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అర్జీల స్వీకరణ



అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వారి నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. వారి నుంచి సేకరించిన అర్జీలను ఆయా విభాగాలకు చెందిన అధికారులకు పంపించారు. అయితే స్పందన కార్యక్రమాన్ని మాత్రం ఎన్నికల కోడ్ నేపథ్యంలో రద్దు చేశారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 83,825 మంది స్వామివారిని దర్శించుకోగా, 25,690 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.57 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన వెంకటగిరి ఎమ్మెల్యే, తిరుపతి ఎంపీ అభ్యర్థులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మద్దిల గురుమూర్తి



గెలుపు బాధ్యత మీదే!

'రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో వివక్షలేని పాలన కొనసాగింది. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందించే వీలు కలిగింది. అందుకే ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడిగే ధైర్యం మనకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారు. ఆయన సంకల్పం ఒక్కటే. ఈ సారి 175కు 175 ఎమ్మెల్యే స్థానాలు, 25కి 25 ఎంపీ స్థానాలు అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలి. ఈ బాధ్యతను మీరే తీసుకోవాలి. ఈ ఎన్నికల్లో జగనన్న సైనికులుగా పనిచేయాలి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత మీరే తీసుకోవాలి' అని మంత్రి, రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. వెంకటగిరిలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

- రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాబోతోంది
- వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తిని గెలిపించండి
- సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవండి
- ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరో సారి ఆశీర్వదించండి
- మంత్రి, రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు

వెంకటగిరి(సైదాపురం): రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాబోతోందని మంత్రి, రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. వెంకటగిరి నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనం వద్ద సోమవారం వెంకటగిరి నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తిని నియోజకవర్గ ప్రజలు ఆదరించి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వీరిద్దరి విజయానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రతి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను మనం గెలిపించుకోవాలని సూచించారు. వివక్షత లేని పాలనతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని, అందుకే ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు అడిగే ధైర్యం కూడా మనకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని గుర్తుచేశారు. జన్మభూమి కమిటీలతో దోచుకున్న టీడీపీ నాయకులకు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు అడిగే అవకాశం కూడా లేకుండా పోయిందని ఆరోపించారు.

సమస్యలు పరిష్కరిస్తూ..ప్రజల్లోనే ఉంటూ..

వెంకటగిరి నియోజకవర్గంలో రామ్‌కుమార్‌రెడ్డి అందరినీ కలుపుకుని ముందుకు సాగారని మంత్రి తెలిపారు. వైఎస్సార్‌సీపీకి బాసటగా నిలిచి 175కి 175 స్థానాలు విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త పనిచేయాలని చెప్పారు. ఎంపీ గురుమూర్తి కేంద్ర ప్రభుత్వం ద్వారా తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకురావడంలో సఫలమయ్యారని, ఆయన సేవలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్ మళ్లీ ఎంపీగా అవకాశం కల్పించారని గుర్తుచేశారు. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి గడప వద్దకూ వెళ్లి సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నారన్నారు. చిన్నచిన్న మనస్పర్థలు వీడి ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ జెండా పట్టుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసేంత వరకు నిరంతరం కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి ఎం.గురుమూర్తి, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణయాచేంద్ర, జేడీసీ మాజీ చైర్మన్, పరిశీలకులు బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కొడవలూరు ధనంజయరెడ్డి, జోనల్ జేసీఎస్ కన్వీనర్ శివశంకర్, నేతలు మాదాసు గంగాధరం, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం అధ్యక్షులు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, మహిళా విభాగం రాష్ట్ర అధికారప్రతినిధి దేవికచౌదరి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలు

నూతనోత్తేజం

వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాకతో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానుల్లో నూతనోత్తేజం నెలకొంది. కనీవిని ఎరుగని రీతిలో నియోజకవర్గంలోని వెంకటగిరి మున్సిపాలిటీ, వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి, సైదాపురం, రాపూరు, కలువాయి మండలాల నుంచి వేలాది సంఖ్యలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు. నేదురుమల్లి నివాసం మరో జన జాతరను తలపించింది.

సమష్టిగా సార్వత్రిక ఎన్నికలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న జేసీ

తిరుపతి అర్బన్: సమష్టిగా సార్వత్రిక ఎన్నికలను దిగ్విజయంగా పూర్తి చేద్దామని కలెక్టర్ జీ.లక్ష్మీశ జాయింట్ కలెక్టర్ హెచ్‌ఎం ధ్యానచంద్రకు సూచించారు. జేసీగా రెండు రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎం ధ్యానచంద్ర సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమష్టిగా సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేద్దామని సూచించారు. వందశాతం పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడానికి నిత్యం అప్రమత్తంగా ఉంటూ అధికారులకు ఎన్నికల నియమావళిని తెలియజేయాలని చెప్పారు. ప్రధానంగా ఎన్నికల కోడ్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు.

ప్రత్యేక నిఘా



ఎంసీఎంసీ సెల్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్, జేసీ

తిరుపతి అర్బన్: ఎన్నికల నిబంధనలకు సంబంధించి పర్యవేక్షణ పటిష్టంగా ఉండాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన జేసీ హెచ్‌ఎం ధ్యానచంద్రతో కలిసి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ సెల్‌ను తనిఖీ చేశారు. ప్రతి అంశాన్ని రికార్డులో నమోదు చేయాలని చెప్పారు. తేదీ, వారంతోపాటు సమయాన్ని కూడా నమోదు చేయాలని సూచించారు. వారి వెంట జిల్లా పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య, ఈశ్వరమ్మ ఉన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటింగ్

- పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు
- ఎన్నికలకు 13,243 మంది సిబ్బంది సిద్ధం
- శాంతిభద్రతలపై పటిష్ట చర్యలు
- సమస్యాత్మక కేంద్రాలు 660
- జిల్లాలో మొత్తం ఓటర్లు 17,94,733 మంది
- మీడియా సమావేశంలో కలెక్టర్ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, జేసీ ధ్యానచంద్ర

తిరుపతి అర్బన్: స్వేచ్ఛాయుత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ నిర్వహిస్తామని కలెక్టర్ జీ.లక్ష్మీశ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్, జేసీ హెచ్‌ఎం ధ్యానచంద్రతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుందని, అప్పటి వరకు చేస్తున్న ఖర్చును ఆ పార్టీ ఖాతాలో లెక్కిస్తామన్నారు. అభ్యర్థి నామినేషన్ వేసిన నాటి నుంచి అభ్యర్థి ఖాతాల్లో ఖర్చును లెక్కిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థి రూ.90 లక్షల వరకు మాత్రమే ఖర్చు చేయాలన్నారు. వాట్సాప్ తరహాలో సీ విజిల్ యాప్ ద్వారా ఎవరైన సమస్యను తెలియజేయొచ్చని సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పటిష్టమైన నిఘా పెట్టామన్నారు. బైండోవర్ కేసులు నమోదు చేశామని, సరిహద్దు రాష్ట్రాల చెక్ పోస్టులతోపాటు జిల్లాలోని చెక్ పోస్టులను మరింత పటిష్టం చేశామని తెలిపారు. జిల్లాలో మొత్తం 2,136 పోలింగ్ కేంద్రాల్లో పని చేయడానికి 13,243 సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. అదనంగా మరో 20శాతం మంది సిబ్బందిని తీకోనున్నట్టు కలెక్టర్ తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

గూడూరు-108	సూళ్లూరుపేట-90
వెంకటగిరి-32	చంద్రగిరి-177
తిరుపతి-86	శ్రీకాళహస్తి-80
సత్యవేడు-72	
నగరి (వడమాలపేట,పుత్తూరు) -15	

మార్చి 16 నాటికి జిల్లాలో ఓటర్ల వివరాలు

జిల్లాలో ఈ నెల 16వ తేదీ నాటికి 17,94,733 మంది ఓటర్లు నమోదయ్యారని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. అందులో పురుషులు 8,74,738 మంది, స్త్రీలు 9,19,817 మంది, ట్రాన్స్ జెండర్లు 178 మంది, దివ్యాంగుల్లో పురుషులు 13,867 మంది, స్త్రీలు10,614 మంది దున్నట్టు చెప్పారు.

పోలింగ్ కేంద్రాల వివరాలు

నియోజకవర్గం	అర్బన్	రూరల్	మొత్తం
వెంకటగిరి	44	254	298
తిరుపతి	267	0	267
చంద్రగిరి	0	395	395
గూడూరు	81	213	294
సూళ్లూరుపేట	74	230	304
శ్రీకాళహస్తి	68	225	293
సత్యవేడు	0	279	279

అంతేకాకుండా యువ ఓటర్లు 36,162 మంది ఉన్నారన్నారు. సీనియర్ సిటిజన్స్(85 సంపైన) 7,940 మంది ఉన్నారని తెలిపారు. ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 287 మంది, సర్వీస్ ఓటర్లు 867 మంది ఉన్నట్టు కలెక్టర్ వివరించారు.

వలంటీర్లకు ఎన్నికల విధులు లేవు

ప్రధానంగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎలాంటి విధులను కూడా సచివాలయ పరిధిలోని వలంటీర్లను అప్పజెప్పడం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

యంత్రాంగం సిద్ధం

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందని ఎస్పీ తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే 82 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పనిచేస్తున్నాయని, జిల్లాకు 3 కంపెనీల కేంద్ర బలగాలు చేరుకున్నాయని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలోని మండలాల్లో కవాతు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. గతంలో ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడిన వారిని బైండోవర్ చేసి, వెపన్స్ అన్నింటినీ స్వాధీనం చేసుకున్నామన్నారు. తిరుపతి జిల్లాలో ఇప్పటివరకు రూ.6.5 కోట్లు సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. 4వేల మంది పోలీస్ సిబ్బంది అవసరం కాగా ఇప్పటి వరకు 2,700 మంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. 7 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, 15 అంతర్‌జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.

నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ ఆఫీసర్లు

వెంకటగిరి–హెచ్‌ఎం ధ్యానచంద్ర–జాయింట్ కలెక్టర్
తిరుపతి–అదిత్ సింగ్–కార్పొరేషన్ కమిషనర్, తిరుపతి
చంద్రగిరి–ఏ.నిషాంత్‌రెడ్డి–తిరుపతి ఆర్డీవో
గూడూరు–కిరణ్‌కుమార్–గూడూరు ఆర్డీవో
సూళ్లూరుపేట–ఆర్.చంద్రముని–సూళ్లూరుపేట ఆర్డీవో
శ్రీకాళహస్తి–ఎన్.రవిశంకర్‌రెడ్డి–శ్రీకాళహస్తి ఆర్డీవో
సత్యవేడు–నరసింహులు–స్పెషల్ డెప్యూటీ కలెక్టర్, ఏపీఐఐసీ

నియోజకవర్గం	ఎన్నికల సిబ్బంది
గూడూరు	1,823
సూళ్లూరుపేట	1,885
వెంకటగిరి	1,848
చంద్రగిరి	2,461
తిరుపతి	1,680
శ్రీకాళహస్తి	1,817
సత్యవేడు	1,730
మొత్తం	13,243

పకడ్బందీగా పది పరీక్షలు

- 162 కేంద్రాల్లో ప్రారంభం
- తొలిరోజు 1,352 మంది విద్యార్థుల గైర్హాజరు



తిరుపతి : విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తున్న సిబ్బంది



ఒకరికిఒకరు : ఆల్ ది బెస్ట్ చెప్పుకుంటున్న విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం తిరుపతి జిల్లా వ్యాప్తంగా 162 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. గత అనుభవాల దృష్ట్యా అధికారులు చేపట్టిన పటిష్ట కార్యాచరణతో ఎటువంటి అవకతవకలు, విమర్శలకు తావులేకుండా పరీక్షలు కట్టుదిట్టంగా సాగాయి. పోలీస్ బందోబస్తు నడుమ ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్నపత్రాలను సురక్షితంగా చేరవేశారు. తొలి రోజు పదోతరగతి పరీక్షలు కావడంతో విద్యార్థులు పలు దేవాలయాల వద్ద కిటకిటలాడారు. పరీక్షా కేంద్రాల వద్ద తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు.

స్క్రైబ్‌కు అనుమతి

జిల్లాలోని తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 28,415 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వాలి ఉండగా వారిలో 1,352 మంది గైర్హాజరైనట్టు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. వివిధ కారణాలతో పరీక్ష రాయలేని విద్యార్థులు, దివ్యాంగ విద్యార్థులకు స్క్రైబ్‌కు అనుమతి ఇచ్చారు.

ఆకస్మిక తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా తొలిరోజు 59 పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్ల సిబ్బందితో పాటు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వీ.శేఖర్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఓఎంఆర్ షీట్లు, పశ్నపత్రాలను పరిశీలించారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పరీక్షలను నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు.

కట్టుదిట్టమైన వాతావరణంలో..

పదో తరగతి పబ్లిక్ పరీక్షలను కట్టుదిట్టమైన వాతావరణంలో నిర్వహించారు. బయటి వ్యక్తులు లోనికి వెళ్లకుండా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. విద్యార్థులతో పాటు పరీక్ష నిర్వహణాధికారుల సెల్‌ఫోన్లను కేంద్రాల్లోకి నిషేధించారు.

ఆచరణాత్మక పరిజ్ఞానం మెరుగు

ఏర్పేడు: విద్యార్థులు ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ సుధీర్ మిశ్రా పిలుపునిచ్చారు. సోమవారం ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ సిమెంటిషియస్ మెటీరియల్స్ క్యారెక్టరైజేషన్, లాబొరేటరీ టెస్టింగ్‌పై హై–ఎండ్ వర్క్ షాపును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాక్సిలరేట్ విజ్ఞాన్ పథకం కింద సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డ్ స్పాన్సర్ చేసిన ఈ ప్రతిష్ఠాత్మక వర్క్ షాప్ ఈ నెల 18 నుంచి 24 వరకు జరుగుతుందన్నారు. పేస్ట్, మోర్టార్, కాంక్రీట్‌తో సహా సిమెంటిషియస్ సిస్టమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ వర్క్ షాపులో ఐఐటీ, ఎన్ఐటీ, ఇతర ప్రముఖ సంస్థల నుంచి 50 మందికి పైగా హాజరైనట్లు వివరించారు. ఇలాంటి వర్క్ షాపులు శాస్త్ర, సాంకేతికతలో నూతన ఆవిష్కరణలకు తోడ్పడుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సురేష్ జైన్, అనిల్‌కుమార్, ప్రసన్న కుమార్ బెహరా, రాహుల్ పాల్గొన్నారు.



ప్రొఫెసర్లు, విద్యార్థులతో సుధీర్‌మిశ్రా

పొత్తు ధర్మం పాటించని టీడీపీ

శ్రీకాళహస్తి : పొత్తు ధర్మాన్ని విస్మరించి టీడీపీ అభ్యర్థులను ప్రకటించిందని బీజేపీ కో–కన్వీనర్ మేళాగరం సుబ్రహ్మణ్యంరెడ్డి విమర్శించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. శ్రీకాళహస్తి బీజేపీ అభ్యర్థి కోలా ఆనంద్‌ను ప్రకటించే అవకాశం ఉందన్నారు. అందుకోసమే ఆయన ఢిల్లీ పెద్దలతో చర్చించేందుకు వెళ్లారని చెప్పారు. కచ్చితంగా కోలా ఆనంద్‌కు టికెట్ వస్తుందని, ఆయన్ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని తెలిపారు. కోలా ఆనంద్ అమ్ముడు పోయాడని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఇలాంటి వాటిని ఖండిస్తున్నట్టు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీలోకి 30 కుటుంబాలు


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి మండలం, మేలచ్చూరు, పల్లం, ఎల్లంపల్లి, గుండ్లపల్లి, కాలంపల్లి గ్రామాల్లోని 30 కుటుంబాలకు చెందిన 300 మంది టీడీపీ కార్యకర్తలు సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జీ.కిరణ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సుబ్బరత్నమ్మ, చెంచమ్మ, వెంకటమ్మ, జయమ్మ, పోలమ్మ, మంజుల, చీరాలమ్మ, స్వప్న, చిన్నమ్మ, బుజ్జమ్మ, సునీత, నాగమణి, వెంకటలక్ష్మి, ధనమ్మ, లక్ష్మీదేవి, శైలజ, పద్మజ, వెంకటలక్ష్మి తదితరులున్నారు. – శ్రీకాళహస్తి

ఇవి కనిపించలేదా?



కోడ్ కూసినా అక్కడక్కడా టీడీపీ బ్యానర్లు, కటౌట్‌లు దర్శనమిస్తున్నాయి. మండలంలోని పడమటి దళితవాడలో ఓ టీడీపీ నేత ఇంటి వద్దే బ్యానర్లు, కటౌట్లు ఉన్నా ఎవ్వరూ అటువైపు కన్నెత్తి చూడలేదు. వీటిని తొలగించడానికి వెళ్లిన ఓ అధికారిపై సదరు టీడీపీ నేత చిర్రుబుర్రులాడినట్టు సమాచారం. – నాగలాపురం

టీడీపీ నేత ఇంటి వద్ద తొలగని బ్యానర్లు, కటౌట్లు

ఎన్నికలప్పుడే గుర్తొస్తామా?

- టీడీపీ నాయకులను నిలదీసిన వేనాటి సుమంత్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వేనాటి సుమంత్‌రెడ్డి

సూళ్లూరుపేట: 'ఎన్నికల సమయంలో మాత్రమే వేనాటి వారి బ్రాండ్‌ను వినియోగించుకోవాలి.. అధికారం వచ్చిన వెంటనే వారిని విస్మరించి సంబంధంలేని వారు, చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వారు పదవులు అనుభవించాలి.. ఇదీ టీడీపీలో మాకు జరుగుతున్న గౌరవం..' అని టీడీపీ నాయకులు వేనాటి రామచంద్రారెడ్డి కుమారుడు వేనాటి సుమంత్‌రెడ్డి (వైఎస్సార్ సీపీ) ధ్వజమెత్తారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ నెలవల సుబ్రమణ్యం చాలా క్యూట్‌గా స్వీట్‌గా, హాట్‌గా తమ తండ్రి రామచంద్రారెడ్డి గురించి మాట్లాడారని అన్నారు. ఆరు సార్లు పరసా వెంకటరత్నయ్యకు రామచంద్రారెడ్డే కదా! టిక్కెట్లు తెచ్చి ఇచ్చింది.. అని గుర్తుచేశారు. ఇందులో మూడుసార్లు గెలిచి మూడు సార్లు ఓడిపోయిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. 2014లో జిల్లా పరిషత్ చైర్మన్‌గా జిల్లాలో ఎవరూ పోటీ చేయడానికి ముందుకు రాకపోతే తమ తండ్రి ముందుకొచ్చి పార్టీ కోసం పోటీ చేస్తే అందరూ కలిసి ఓడించలేదా అని నిలదీశారు. ఉన్న ఆస్తులను అమ్ముకున్నామని వాపోయారు. పార్టీ కోసం, పార్టీని నమ్ముకుని రూ.150 కోట్ల ఆస్తిని పోగొట్టుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో ఓడిపోయిన వారికి ఏదోరకంగా న్యాయం చేసిన చంద్రబాబు రూ.150 కోట్ల ఆస్తిని పార్టీకోసం ధారబోసిన తమ తండ్రికి ఏం న్యాయం చేశారని ప్రశ్నించారు. తన సామాజికవర్గానికి న్యాయం చేసిన చంద్రబాబు తమ తండ్రికి ఎందుకు చేయలేదని మండిపడ్డారు. 42 ఏళ్లుగా పార్టీకి చేసిన సేవలకు వేనాటి వారికి చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేష్ పొమ్మనలేక పొగబెట్టారని విమర్శించారు. రామచంద్రారెడ్డి టీడీపీని పార్టీగా భావించకుండా కుటుంబంగా భావించి పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు. 2014లో తాను జగనన్న విధి విధానాలు నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరితే తమ తండ్రి కోసం ఐదు సంవత్సరాలు పార్టీకి దూరంగా ఉండాల్సి వచ్చిందని చెప్పారు. తమ కుంటుంబంలో చిచ్చుపెట్టేందుకు నెలవల చేసిన కొన్ని వాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. సరైన సమయంలో తమ కుటుంబమంతా సరైన నిర్ణయం తీసుకుని భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. చివరగా ఆయన జోహార్ ఎన్టీ.. బైబై బాబు..గుడ్‌బై టీడీపీ అని అన్నారు.

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి

2024 ఎన్నికల్లో కూడా మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావడం తథ్యమని వేనాటి సుమంత్‌రెడ్డి అన్నారు. నవరత్నాలు, అభివృద్ధి పనులే ఆయన్ని ముఖ్యమంత్రిని చేస్తాయని చెప్పారు. కొంతమంది మతిలేని టీడీపీ నాయకులు అభివృద్ధి చేయలేదని మాట్లాతున్నారని, రోడ్లు వేయడం, డ్రైనేజీ కాలువలు నిర్మించడం, వీధిలైట్లు వేయడమేనా అభివృద్ధి అంటే అని నిలదీశారు.

జ్ఞానసంపదను భావితరాలకు అందించాలి


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న యూజీసీ సెక్రటరీ ప్రొఫెసర్ మనీష్ ఆర్ జోషి

తిరుపతి సిటీ : అధ్యాపకులు భారత జ్ఞాన సంపదను భావితరాలకు అందించాలని యూజీసీ సెక్రటరీ ప్రొఫెసర్ మనీష్ ఆర్ జోషి సూచించారు. తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీలో సోమవారం ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రాం ఇన్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ అనే అంశంపై వారం రోజుల పాటు జరిగే అధ్యాపకుల శిక్షణా శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ దేశాన్ని ప్రగతి పథంలో నడపాలంటే యువశక్తి ప్రధానమన్నారు. వికసిత్ భారత్ –2047 లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఎలాంటి కార్యాచరణలు, ప్రణాళికలు, పరిశోధనలు జరగాలనే అంశంపై అధ్యాపకులు దృష్టి సారించాలని సూచించారు. భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడాలనే దృఢ సంకల్పంతో విశ్వవిద్యాలయాలు అడుగులు వేయాలని చెప్పారు. ప్రధానంగా నూతన విద్యావిధానంతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్లు చెప్పారు. దీంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన దిశగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అధ్యాపకులు శిక్షణా శిబిరాన్ని ఉపయోగించుకుని మరింత జ్ఞానాన్ని యువతరానికి అందించి దేశాభివృద్ధికి దోహదపడేలా సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం శిక్షణకు హాజరైన అధ్యాపకుల సందేహాలను ఆయన స్వయంగా నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూజీసీ డిప్యూటీ సెక్రటరీ శాలిని, వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమాశ్రీ, గంటి సూర్యనారాయణ, శివరామ్‌భట్, పి వెంకట్రావు, పలు విశ్వవిద్యాలయాల నుంచి సుమారు 125 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి సిటీ : యూజీసీ, సీఎస్ఐఆర్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) అర్హత పొంది పీహెచ్‌డీ (ఫుల్‌టైమ్) కోర్సులో చేరదలచిన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎస్వీయూ రిజిస్ట్రార్ ఓ మహ్మద్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వీయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు ఎస్వీయూ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీలోకి 200 మంది టీడీపీ కార్యకర్తలు


పార్టీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు కొనసాగుతోంది. సోమవారం చిల్లకూరులోని ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నివాసం వద్ద సుమారు 200 మంది టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే సంజీవయ్య సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేటలో కిలివేటి సంజీవయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలంతా జగనన్న పక్షాన ఉన్నారని తెలిపారు. ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత చంద్రబాబుకు, టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నాయకులకు లేదన్నారు. అనంతరం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నం, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కరణం రఘునాయుడు, భావన్, మునిరాజ, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటే ఆయుధం


ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎన్నికల అధికారి, కలెక్టర్


తిరుపతి సిటీ : ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఆయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జీ.లక్ష్మీశ పిలుపునిచ్చారు. సోమవారం ఓటు హక్కు సద్వినియోగంపై తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి గాంధీరోడ్డు వరకు జరిగిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గత ఎన్నికల కంటే ఓటింగ్ శాతం పెరగాలని, అర్హత ఉన్న ప్రతి పౌరుడూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యువత ఓట్లు ప్రగతికి మెట్లు అని చెప్పారు. అనంతరం జేసీ ధ్యానచంద్ర, నగరపాలక కమిషనర్ అతిదిసింగ్, జిల్లా అధికారులు ప్లకార్డులు చేతబూని ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని నినాదాలు చేశారు.


21న పీవోలు, ఏపీవోలకు శిక్షణ

తిరుపతి అర్బన్: ఎన్నికల ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ ఉంటుందని కలెక్టర్ జీ.లక్ష్మీశ తెలిపారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఇస్తారని వెల్లడించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని ఉద్యోగులకు తిరుపతి ఎస్వీయూ యూనివర్సిటీలో, తిరుపతి నియోజకవర్గంలోని ఉద్యోగులకు ఇందిరా మైదానం ఎదురుగా తుడా ప్రాంగణంలో ఉన్న కచ్చపి ఆడిటోరియంలో, గూడూరు నియోజకవర్గంలోని ఉద్యోగులు గూడూరులోని దువ్వూరు రమణమ్మ ఉమెన్స్ కాలేజీలో, నగరి నియోజకవర్గంలోని పుత్తూరు, వడమాలపేట మండలం వారు ఓఊఈ హోమియోపతి మెడికల్ కాలేజ్ పుత్తూరులో, సత్యవేడు నియోజకవర్గంలోని ఉద్యోగులు సత్యవేడులోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో, శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఉద్యోగులు స్కిట్ కాలేజీలో, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఉద్యోగులు శ్రీవీఎస్ శివలింగం చెట్టియార్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, వెంకటగిరి నియోజకవర్గంలోని ఉద్యోగులు ఉషోదయ డిగ్రీ కాలేజ్ వెంకటగిరిలో శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు. ఈ శిక్షణ తరగతులకు ఎన్నికల విధులు కేటాయించబడిన పీఓలతోపాటు ఏపీఓలు తప్పకుండా హాజరు కావాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాయుడుపేటలో చెడ్డీ గ్యాంగ్!

- సిల్వర్, జ్యువెలరీ దుకాణంలో చోరీ
- రూ.50 లక్షల వెండి, బంగారు, నగదు అపహరణ
- సీసీ ఫుటేజీలో చెడ్డీ గ్యాంగ్ దుండగుడుగా గుర్తింపు


దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


దుకాణంలో దుండగుడు

నాయుడుపేటటౌన్: పట్టణంలో చెడ్డీగ్యాంగ్ హల్‌చల్ చేసింది. ప్రధాన వీధిలో రెండు దుకాణాల షట్టర్లు పగులగొట్టి చోరీకి పాల్పడింది. ఓ సిల్వర్ అండ్ జ్యువెలరీ దుకాణంలో సుమారు రూ.50 లక్షల వరకు వెండి వస్తువులు, బంగారు ఆభరణాలు, నగదు చోరీచేసింది. బాధితుల కథనం.. ఓజిలి మండలం, కర్రబల్లోలు గ్రామానికి చెందిన శివకృష్ణ నాయుడుపేట పట్టణంలోని దర్గావీధిలో ఎస్‌బీఆర్ఎస్ సిల్వర్ అండ్ జ్యువెలర్స్ పేరుతో దుకాణం నడుపుతున్నాడు. శనివారం రాత్రి దుకాణాన్ని మూసి స్వగ్రామానికి వెళ్లాడు. ఆదివారం సెలవు కావడంతో ఇంటివద్దే ఉండిపోయాడు. సోమవారం ఉదయం దుకాణం షట్టర్లు పగులగొట్టి ఉండడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుకాణంలో ఉన్న సుమారు 50 కిలోల వెండి వస్తువులు (వీటి విలువ సుమారు రూ.38 లక్షలు), 180 గ్రాముల బంగారు వస్తువులు (22 సవర్లు, వీటి విలువ సుమారు రూ.11 లక్షలకు పైనే), రూ.70 వేల నగదు అపహరించుకుని పోయినట్లు బాధితుడు తెలిపాడు. దుండగుడు షట్టర్ పగులగొట్టి దుకాణంలోకి ప్రవేశించడం, నగదు కౌంటర్‌ను పెకలించి నగదు చోరీ చేయడం లాంటి దృశ్యాలను సీసీ ఫుటేజీలో నమోదై ఉన్నాయి. దుకాణంలో ఉన్న లాకర్ తెరుచులేదు. దుండగుడి వంటిపై చెడ్డీ మాత్రమే ఉండడాన్ని గుర్తించారు. ఈ దుకాణం పక్కనే ఉన్న రాధాకృష్ణ ప్రొవిజన్స్ షట్టర్ కూడా పెకలించాడు. అదేవిధంగా పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న ఓ చిన్నపాటి దుకాణంలో కూడా తాళాలు పగులగొట్టినట్టు బాధితుడు చెన్నయ్య విలేకరులకు తెలిపారు.

దర్యాప్తు ముమ్మరం

చోరీ జరిగిన తీరుపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దుకాణంలో దొరికిన సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడి ఆచూకీ గుర్తించేందుకు జిల్లా క్లూస్ టీం ఎస్ఐ దస్తగిరి వేలి ముద్ర నిపుణులతో కలసి పరిశీలించినట్టు వెల్లడించారు. రెండు రోజుల కిందట పట్టణంలో ఆంధ్రాబ్యాంక్ వీధిలో ఉన్న ఓ వంటనూనె దుకాణంలో కూడా ఇదే తరహాలో చోరీ జరిగినట్టు పేర్కొన్నారు.